సాక్షి
శ్రీకాకుళం

ఆదివారం । 27 । జూలై । 2025



'యాప్'సోపాలు

అంగన్‌వాడీలకు ఆపసోపాలు తప్పడం లేదు. యాప్‌లతో అవస్థలు పడుతున్నారు.

- 8లో



కారులో సారా రవాణా

కంచిలి సమీపంలో కారులో సారా రవాణా చేస్తూ దొరికిపోయారు. 1250 సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. - 8లో

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

సరుబుజ్జిలి: వెన్నెలవలస జవహర్ నవోదయ విద్యాలయంలో 9, 11 తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి సెప్టెంబర్ 23లోగా ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని విద్యాలయం ప్రిన్సిపాల్ జి.బేతనసామి శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 7న నిర్వహించనున్నట్లు తెలిపారు.

న్యూస్‌రీల్

ఏయూ దూర విద్య ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆంధ్రా యూనివర్సిటీ సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ ద్వారా 2025-26 విద్యా సంవత్సరానికిగాను వివిధ యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారని శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ఏయూ దూరవిద్య అధ్యయన కేంద్రం కోర్డినేటర్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీరాములు తెలిపారు. డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ, పీజీ ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీలో చేరేందుకు అడ్మిషన్ల కోసం సెప్టెంబర్ 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు వెంటనే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని శ్రీరాములు సూచించారు. మరిన్ని వివరాలకు తమ కళాశాలలో ఉన్న అధ్యయన కేంద్రాన్ని సంప్రదించాలని ఆయన కోరారు.

ఎరువుల పంపిణీకి ఇకపై కూపన్ పద్ధతి



కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్


శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని రైతు సేవా కేంద్రాలకు శనివారం 600 టన్నుల యూరియాను సరఫరా చేసినట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. వ్యవసాయశాఖ జిల్లా అధికారి కోరాడ త్రినాథ స్వామితో తన చాంబర్‌లో నిర్వహించిన సమీక్షలో యూరియా పంపిణీపై కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ఆర్‌ఎస్‌కేకు మండల వ్యవసాయ అధికారి, తహసీల్దార్ సంతకాలతో కూడిన కూపన్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కూపన్ల ఆధారంగా రైతులకు అవసరమైన యూరియాను స్థానిక ఆర్‌ఎస్కే ఇన్‌చార్జులు పంపిణీ చేస్తారు. కూపన్ పొందిన రైతులు, అందులో ఉన్న తేదీ, నిర్దేశిత సమయం మేరకు ఆర్‌ఎస్కే కేంద్రాలకు వెళ్లి ఎరువును తీసుకోవాలని తెలిపారు. రద్దీని నియంత్రించేందుకు ఈ విధానం అమలు చేస్తున్నామని కలెక్టర్ వివరించారు. వరిచేనుకు శాస్త్రీయంగా 25 రోజుల వయస్సులో 25 కిలోల యూరియా సరిపోతుందని, అంతకుమించి వేస్తే చీడపీడలు అధికమయ్యే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు సూచించారు. అవసరానికి అనుగుణంగా ఎరువుల సరఫరా కొనసాగుతుందని, వాటిని అనవసరంగా నిల్వ చేసుకోవద్దని అధికారులు సూచించారు.

కిలో బియ్యం బదులుగా కిలో రాగులు



శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆగస్టు నుంచి రేషన్ కార్డుదారులకు ఒక కిలో బియ్యం బదులుగా ఒక కిలో రాగులు పంపిణీ చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తెలిపారు. ప్రజలకు పోషకాహారాన్ని అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని ఆయన స్పష్టం చేశారు. ఈ రాగులను చౌక ధరల దుకాణాల ద్వారా పంపిణీ చేస్తారని, రాగులు కావాలనుకునే రేషన్ కార్డుదారులు తమ డీలర్‌కు ముందుగానే తెలియజేయాలని, అలా తెలియజేసిన వారికి మాత్రమే డీలర్ల ద్వారా రాగులు అందజేస్తారని ఆయన పేర్కొన్నారు.

టెక్కలి ఆదిఆంధ్రావీధిలో ఎస్టీ బాలుర వసతి గృహంలో రాత్రి వేళ తరగతి గదిలోనే నిద్రిస్తున్న విద్యార్థులు



శ్రీముఖలింగం బీసీ వసతి గృహంలో ఆరుబయటే భోజనాలు చేస్తున్న విద్యార్థులు



ఆ గృహాల్లో.. సమస్యలకే వసతి!

- నరక కూపాలుగా మారిన వసతి గృహాలు
- హాస్టల్‌లో ఉండేందుకు సుముఖత చూపని విద్యార్థులు
- సముద్ర తీర ప్రాంతాల్లో ఇళ్లకు వెళ్లి అటెండెన్స్‌లు వేస్తున్న వైనం
- రాత్రి 8 తర్వాత చాలా హాస్టళ్లలో కనిపించని విద్యార్థులు
- 'సాక్షి' పరిశీలనలో వెలుగు చూసిన వాస్తవాలు

పిల్లాడికి ఇంటి దగ్గర దొరకని పౌష్టికాహారం హాస్టల్‌లో దొరుకుతుందని ఆ తల్లిదండ్రులు నమ్మారు. తాము ఇవ్వలేని సదుపాయాలు ప్రభుత్వం వసతి గృహంలో కల్పిస్తారని ఆశ పడ్డారు. కన్నపేగులు ఉన్నతంగా మారుతారని విశ్వసించారు. కానీ జరుగుతున్నదేమిటి..? చిరిగిపోయిన దుప్పట్లతో నేలపై నిద్రిస్తూ పిల్లలు అవస్థలు పడుతున్నారు. ఎప్పుడు ఊడిపోతాయో తెలియని పెచ్చుల వంక చూస్తూ భయంభయంగా కాలం గడుపుతున్నారు. రాత్రి పూట హాస్టల్లో ఉంటే ఏమవుతుందోనని భయపడి ఇంటికి వెళ్లి పడుకుంటున్నారు. మలేరియా, డయేరియా, డెంగీల వంటి వ్యాధులు దాడి చేస్తుంటే ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలోకి వెళ్లిపోయారు. జిల్లావ్యాప్తంగా సంక్షేమ వసతి గృహాల తీరుపై 'సాక్షి' నిర్వహించిన పరిశీలనలో అనేక విషయాలు వెలుగు చూశాయి.

– సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం

పాతపట్నంలో..



పాతపట్నం ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో వాష్ రూమ్ పరిస్థితి

- పాతపట్నంలోని కోర్టు కోడలి వద్ద ఉన్న ఇంటిగ్రేటెడ్ బాయ్స్ హాస్టల్‌లో పరిసరాలు పరిశుభ్రంగా లేవు.
- ఎస్సీ బాలికల వసతి గృహంలో మెనూ సక్రమంగా అమలు కావడం లేదు. కూరగాయలు కూడా విద్యార్థులే తెచ్చుకుంటున్నారు.
- ఎస్టీ బాయ్స్ హాస్టల్ పాత భవనం కావడంతో వర్షం పడితే ఇబ్బందులు తప్పడం లేదు.
- కొత్తూరు మండలం కురిగాం, కొత్తూరు ఎస్సీ హాస్టల్స్‌లో సరైన సౌకర్యాలు లేకపోవడంతో పిల్లలు చేరడానికి ఇష్టపడటం లేదు.

ఆమదాలవలసలో..

- ఆమదాలవలస మెట్టక్కివలసలోగల ఎస్సీ బాలికల వసతి గృహంలో గదుల్లో పైకప్పు పెచ్చులూడిపడుతోంది. మరుగుదొడ్లు కూడా సరిపడినన్ని లేవు. • బూర్జ మండలంలో తోటాడ గ్రామంలో గల బీసీ బాలుర వసతి గృహం పూర్తిగా శిథిలమైంది. దీంతో విద్యార్థులు పక్కనే ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తలదాచుకుంటున్నారు.

ఆమదాలవలస కొత్తకోటవారి వీధిలో శిథిలావస్థలో హాస్టల్



ఇచ్ఛాపురంలో..

- ఇచ్ఛాపురం మండలం కొళిగాం బాలుర బీసీ హాస్టల్‌లో ఫేస్ యాప్‌లో అటెండెన్స్ తీసుకొని మాల్‌ప్రాక్టీసు పాల్పడుతున్నారన్నఆరోపణలు ఉన్నాయి.
- కవిటి మండలం పెద్దకర్రివానిపాలెం బీసీ బాలుర హాస్టల్‌లో విద్యార్థులు ఉదయం, రాత్రిపూట ఇక్కడ భోజనాలు చేసి ఇళ్లకు వెళ్లిపోతున్నారు.
- సోంపేట మండలం బారువ మేజర్ పంచాయతీలో వాడపాలెం గ్రామంలోని హాస్టల్‌లో విద్యార్థినులకు వసతులు లేవు.



సోంపేట మండలం వాడపాలెం హాస్టల్‌లో వంట గది పైకప్పు దుస్థితి



శ్రీకాకుళం నగరంలోని గిరిజన గురుకులంలో సరైన వసతులు లేక నేలపై నిద్రిస్తున్న విద్యార్థులు

శ్రీకాకుళంలో..

- గార మండలం బందరువానిపేట బీసీ వెల్ఫేర్ హాస్టల్ చీకటి పడిన తర్వాత మూతబడుతుంది. గ్రామ శివారులో ఉండటంతో ఇంటి వద్దనే సురక్షితమని తల్లిదండ్రులు అంటున్నారు.
- శ్రీకాకుళంలోని రెండు బీసీ సంక్షేమ ప్రీమెట్రిక్ హాస్టల్‌లో ఇంకా కొత్త బ్లాంకెట్లు ఇవ్వలేదు. ట్రంకు పెట్టెలు కూడా పగిలిపోయి ఉన్నాయి.
- గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలోనే పాత బ్లాంకెట్లనే వాడుతున్నారు. భోజనం, ఉండడం, చదవడం, తరగతి గదులు ఒకే చోట కావడంతో ఇబ్బందులు పడుతున్నారు.

టెక్కలిలో..

- టెక్కలి మండలంలోని ఆదిఆంధ్రావీధిలో గల ఎస్టీ బాలుర వసతి గృహంలో భవనాలు కొరతగా ఉండడంతో, విద్యార్థులు రాత్రి సమయాల్లో తరగతి గదిలోనే నిద్రిస్తున్నారు.
- ఎస్టీ బాలికల మేనేజ్‌మెంట్ వసతి గృహం భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి.
- అయ్యప్పనగర్‌లో గల బీసీ బాలుర వసతి గృహానికి ప్రహరీ లేదు.

ఎచ్చెర్లలో..

- రణస్థలం మండలం కేవీ పేట, జీరుపాలెం, కె.మత్స్యలేశం, డి.మత్స్యలేశం, పాతర్లపేట గ్రామాల్లో గల హాస్టళ్లలో విద్యార్థుల హాజరుకి ఉన్న పిల్లలకు తేడా ఉంది.
- వసతి గృహాలు పూర్తిగా శిథిలావస్థలో ఉన్నాయి.
- ఎచ్చెర్ల మండలంలో మెట్టవలస, బొంతల కోడూరులో విద్యార్థులకు సరైన మెనూ అందడం లేదు.

పరిశీలనలో తేలిన విషయాలు

- జిల్లాలో బీసీ సంక్షేమశాఖ పరిధిలోని సముద్ర తీర ప్రాంతాల్లో ఉండే హాస్టల్స్‌లో పరిస్థితులు విచిత్రంగా ఉన్నాయి. ఇక్కడ అసలు విద్యార్థులే ఉండ డం లేదు. అయినా ప్రతి నెలా బిల్లులు డ్రా చేస్తున్నారు.
- ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ నమోదుకి ఇంటింటికి వెళ్తున్నట్లు సమాచారం. దీనికి అధికారులకు ముడుపులు చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది.
- బీసీ వసతి గృహాల మరమ్మతులకు కోట్లాది రూపాయలు వెచ్చించినా అందుకు తగిన పనులు జరగలేదని విమర్శలు వినిపిస్తున్నాయి.
- సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లోనూ అదే పరిస్థితి ఉంది.
- బదిలీల దగ్గరి నుంచి వసతి గృహాల వరకు ముడుపులతోనే వ్యవహారం నడుస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి.
- సంబంధిత జిల్లా అధికారిపైనే నేరుగా ఫిర్యాదులు వెళ్తున్నాయి.

నరసన్నపేటలో..

- నరసన్నపేట నియోజకవర్గంలోని పోలాకి, ఉర్లాం, జలుమూరు బీసీ హాస్టల్స్‌లో ఇన్‌చార్జి వార్డెన్లు పనిచేస్తున్నారు.
- విద్యార్థులంతా నేలపైనే నిద్రిస్తున్నారు. నేలపైనే కూర్చొని భోజనం చేస్తున్నారు.
- శ్రీముఖలింగం బీసీ వసతిగృహంతో పాటు నరసన్నపేటలో అమ్మాయిలు, అబ్బాయిలు వసతిగృహాలు ప్రైవేటు భవనాల్లో నిర్వహిస్తున్నారు.

పలాసలో..



కాశీబుగ్గ బీసీ బాలుర వసతి గృహంలో కూలిన ప్రహరీ

- పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో బీసీ బాయ్స్ వసతిగృహంలో ప్రహరి కూలిపోయింది. ఎస్సీ, ఎస్టీ వసతి గృహంలో తాగునీరు అందుబాటులో లేదు. 150 మంది పిల్లలకు నాలుగంటే నాలుగే మరుగుదొడ్లు ఉన్నాయి.
- మందస కేజీబీవీలో రసం మంచినీటిని తలపిస్తుంది. అన్నం ముక్కిపోయిన వాసన వస్తోంది.
- పలాస మండలం లొత్తూరు ఎస్టీ వసతి గృహానికి ప్రహరీ లేదు.

గదులు లేక ఇబ్బందులు పడుతున్నాం



హాస్టల్‌లో గదులు చాలక ఇబ్బందులు పడుతున్నాం. ఏడు తరగతులకు నాలుగు గదులు మాత్రమే ఉన్నాయి. దీంతో ఒకే గదిలో భోజనాలు, తరగతులు, నిద్రించడం చేస్తున్నాం. గదులు చాలక పోవడంతో పెట్టెలు వరండాల్లో ఉన్నందున వర్షం వస్తే తడుస్తున్నాయి.

– ఎస్.రాధమ్మ, ఏడో తరగతి, మినీ గురుకులం విద్యార్థి, కారిగూడ, కొత్తూరు మండలం

బీసీ ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లు	61
ఎస్సీ ప్రీ మెట్రిక్, పోస్టుమెట్రిక్ హాస్టళ్లు	31
మోడల్ స్కూళ్లు	13
కేజీబీవీలు	25
గిరిజన ఆశ్రమ పాఠశాలలు	29
గిరిజన గురుకులాలు	4
పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లు	12
మినీ గురుకులం	1
సాంఘిక సంక్షేమ గురుకులాలు	2
జ్యోతిరావు పూలే గురుకులాలు	11

డిపార్ట్‌మెంటల్ పరీక్షలకు ఏర్పాట్లు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ డిపార్ట్‌మెంటల్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని డీఆర్ఓ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం తన కార్యాలయంలో సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీ శివాని ఇంజినీరింగ్ కాలేజ్ చిలకపాలెం ఎచ్చెర్ల, కోర్ టెక్నాలజీస్ నరసన్నపేట పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

మీరు దాడులు చేస్తారా.. నన్ను చేయించమంటారా..?

- నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ ఘాటు వ్యాఖ్యలు
- స్టేషన్ అధికారుల డొల్లతనాన్ని బయటపెట్టిన ఎస్పీ
- పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా సర్కిళ్ల వారీగా లోపాలను వివరించిన మహేశ్వర రెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ :

జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి నిర్వహించిన నేర సమీక్ష సమావేశం హాట్‌హాట్‌గా సాగింది. జిల్లాలో ఉన్న అన్ని స్టేషన్ల అధికారులతోనూ ఎస్పీ మాట్లాడారు. అధికారుల డొల్లతనాన్ని, నిర్లక్ష్య వైఖరిని సర్కిళ్ల వారీగా పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ చేసి మరీ చూపించారు. ముఖ్యంగా పేకాట, బెట్టింగ్, గంజాయి, లిక్కర్, బెల్టుషాపులపై చర్యలు తీసుకోవడంలోను, నిందితులను పట్టుకోవడంలో ఎలా విఫలమవుతున్నారన్నది.. తన వద్దనున్న ప్రతి స్టేషన్ చిట్టా చూపించి మరీ వివరించారు.

పనితీరు మార్చుకోవాలి..

ఒకానొక సందర్భంలో 'మీరు చేస్తారా.. లేదంటే ఎస్పీ అయిన నేను చేయాలా.. ఇప్పటికే గంజాయి పట్టుకోవడానికే ఉన్న టాస్క్‌ఫోర్స్ పోలీసులను పేకాట, బెట్టింగ్, ఇతర ముఖ్య కేసుల్లో వాడుకోవాల్సిన పరిస్థితికి తెచ్చారు' అన్నారు. టాస్క్‌ఫోర్స్ వాళ్లు పదికేసులు కడితే మీరు 2 కేసులు కడుతున్నారని అన్నారు. మీరు పట్టుకుంటే రూ.వేలల్లో చూపిస్తున్నారని, టాస్క్‌ఫోర్స్ వాళ్లైతే పేకాట, బెట్టింగ్‌లే వ్యాపార లావాదేవీలుగా సాగించి రూ.కోట్లు ఆర్జించే కరడుగట్టిన పాత నిందితులను పట్టిస్తున్నారని, రూ.లక్షల్లో నగదు స్వాధీనం చేసుకుంటున్నారని అన్నారు. 'మీరు ఎంత మందిని పట్టుకుంటున్నారో.. ఎవరెవరిని వదిలేస్తున్నారో.. అంతా చిట్టా ఉంది' అని అన్నారు. నిజాయితీగా దాడులు చేయకపోతే తానే స్వయంగా రంగంలోకి దిగి రైడింగ్‌కు వెళ్లాల్సి వస్తుందని, టాస్క్‌ఫోర్స్ వాళ్లకే అన్ని కేసులూ అప్పజెప్పాల్సిన పరిస్థితి వస్తుందని ఎస్పీ హెచ్చరించారు. పాతపట్నం, ఎచ్చెర్ల, నందిగాం, మందస, నరసన్నపేట, ఆమదాలవలస స్టేషన్ అధికారులకు ఎస్పీ గట్టిగానే హెచ్చరించినట్లు సమాచారం.

పెండింగ్ కేసులపై దృష్టి పెట్టండి: ఎస్పీ

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తుపై పూర్తి దృష్టి పెట్టాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అధికారులకు స్పష్టం చేశారు. క్రైమ్ అగైనెస్ట్ ఉమెన్స్ కేసుల్లో 60 రోజు ల్లో దర్యాప్తు పూర్తిచేసి చార్జిషీటు దాఖలు పర్చాలని తెలిపారు.

- రోడ్డు ప్రమాదంలో మరణించిన డీఎస్పీ శాంతారావు స్వస్థలం డోల
- 14 ఏళ్ల కిందట కూడా రోడ్డు ప్రమాదానికి గురైన అధికారి

పోలాకి/జలుమూరు: తెలంగాణలో జరిగిన రోడ్డు ప్రమాదం పోలాకి మండలం డోలలో విషాద ఛాయలు నింపింది. అక్కడి ప్రమాదంలో మృతి చెందిన డీఎస్పీ జల్లు శాంతారావు స్వస్థలం డోల కావడంతో ఇక్కడ కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. శాంతారావు సోదరుడు సైతం డిపార్ట్‌మెంట్‌లోనే కానిస్టేబుల్‌గా పనిచేసి మృతిచెందారు. శాంతారావుకు భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు ఉన్నత చదువుల కోసం నెదర్లాండ్స్‌లో ఉన్నారు. చిన్నకుమారుడు హైదరాబాద్‌లో ఉంటున్నారు. శాంతారావు అంత్యక్రియలు స్వగ్రామం డోలలోనే ఆదివారం నిర్వహించనున్నట్లు ఆయన సోదరుడి కుమారుడు, పోలాకి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జల్లు శివ తెలిపారు.

తెలంగాణలో ప్రమాదం.. డోలలో విషాదం



శాంతారావు(ఫైల్)

కొల్లవాని పేట అల్లుడు..

శాంతారావు కొల్లవాని పేట అల్లుడు కావడంతో ఆ గ్రామంలో కూడా విషాద ఛాయలు అలుముకున్నాయి. ఇదే గ్రామానికి చెందిన లక్ష్మిని శాంతారావు వివాహం చేసుకున్నారు.

14 ఏళ్ల క్రితం ప్రమాదంలో తీవ్రగాయాలు..

14 ఏళ్ల క్రితం హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో శాంతారావు తీవ్రంగా గాయపడ్డారు. చాలా కాలం పాటు ఆస్పత్రిలో ఉన్నారు. లారీ ఢీకొనడంతోనే అప్పుడు కూడా ప్రమాదం జరిగిందని.. ఇప్పుడు ప్రమాదానికి కూడా లారీయే కారణమని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

కృష్ణదాస్ దిగ్భ్రాంతి

పోలాకి: డోల గ్రామానికి చెందిన అధికారి జల్లు శాంతారావు మృతిపై మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గ్రామం నుంచి విశేషంగా ఎదిగి, అందరికీ గర్వకారణంగా నిలిచిన శాంతారావు రోడ్డు ప్రమాదంలో మృతిచెందటం బాధాకరమని అన్నారు.



తళుకుమన్నది కులుకుల తార - 8లో

సినీనటి ఈషా రెబ్బా సిక్కోలులో తళుక్కుమంది. జిల్లా కేంద్రంలోని ఎస్ఎస్ జ్యూయలరీ ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఆమెను చూసేందుకు అభిమానులు ఎగబడ్డారు.

బాబు మోసాలను వివరిద్దాం

- పార్టీని మరింతగా పటిష్టం చేసుకుందాం
- వైఎస్సార్ సీపీ శ్రీకాకుళం పార్లమెంట్ పరిశీలకుడు కుంభా రవిబాబు పిలుపు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ):

చంద్రబాబు నాయుడు అధికార దాహంతో అమలు చేయలేని హామీలిచ్చి, తీరా అధికారంలోకి వచ్చాక విస్మరించారని, ఆయన మోసాలను అందరికీ వివరిద్దామని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు ఎమ్మెల్సీ కుంభా రవిబాబు పిలుపునిచ్చారు. ఈ ఏడాది కాలంలో ప్రతి కుటుంబానికి చంద్రబాబు రూ.1.30 లక్షలు బాకీ పడ్డ విషయాన్ని అందరికీ వివరించాల్సిన బాధ్యత వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై ఉందన్నారు. బాబు ష్యూరిటీ...మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ప్రతి గడప తొక్కి కూటమి మోసాల్ని చెప్పాలన్నారు. శ్రీకాకుళంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం పార్టీ ముఖ్య నాయకులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, నియోజకవర్గ, మండల స్థాయి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్ తన ఐదేళ్ల పాలనలో యాభై ఏళ్ల బలాన్ని సంపాదించుకున్నారని తెలిపారు. ప్రతి గ్రామంలో ఎవరైతే ఇప్పటి నుంచి పార్టీ కోసం కష్టపడి పనిచేస్తారో అధికారంలోకి వచ్చాక కూడా వారికే పదవులు వస్తాయన్నారు. కమిటీల నియామకాల్లో నియోజకవర్గ ఇన్‌చార్జిలు చొరవ చూపాలన్నారు. ప్రతి సమావేశానికి అనుబంధ విభాగాల నాయకులు హాజరవ్వాలన్నారు. పార్టీని మరింత పటిష్టం చేసుకుందామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ పార్లమెంట్ పరిశీలకుడు కుంభా రవిబాబు

సమావేశంలో మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి, పార్టీ టెక్కలి, ఆమదాలవలస సమన్వయ కర్తలు పేరాడ తిలక్, చింతాడ రవికుమార్, పార్టీ కాళింగ, కళింగవైశ్యకుల రాష్ట్ర అధ్యక్షులు దుంపల రామారావు (లక్ష్మణరావు), అంధవరపు సూరిబాబు, యువ నాయకులు తమ్మినేని చిరంజీవి నాగ్, మార్పు పృథ్వీ, ప్రత్తి అన్వేష్, గేదెల పురుషోత్తం, సాధు వైకుంఠరావు, డాక్టర్ చింతాడ వరుణ్, గొండు కృష్ణమూర్తి, ముంజేటి కృష్ణమూర్తి, చిట్టి జనార్దన, రౌతు శంకరరావు, ఎంఏ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయండి



అంకితభావంతో పార్టీకి పని చేయాల్సిన అవసరం ఉంది. బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆగస్టు 8వ తేదీ వరకు నిర్వహించాలి. ప్రతి గ్రామంలో బాబు మోసాల్ని క్యూఆర్‌కోడ్ ద్వారా తెలియజేయాలి.

–ధర్మాన కృష్ణదాస్, పార్టీ జిల్లా అధ్యక్షుడు

క్లుప్తంగా

టి.డి.వలసలో వైద్యబృందం పర్యటన



గ్రామస్తులతో మాట్లాడుతున్న వైద్యబృందం

జి.సిగడాం: టంకాల దిగ్గువలస గ్రామంలో జ్వరాలు పూర్తిస్థాయిలో అదుపులోకి వచ్చే వరకు వైద్య శిబిరాలు, రక్త పరీక్షలు కొనసాగిస్తామని వైద్యాధికారులు యశ్వంత్, సుమబిందు తెలిపారు. జ్వరాలు తగ్గుముఖం పట్టినప్పటికీ కీళ్ల నొప్పులు, కాళ్ల పొంగులు ఉండటంతో పాటు అక్కడక్కడా జ్వరాలు పీడితులు ఉన్న నేపథ్యంలో శనివారం జిల్లా కేంద్రాస్పత్రి నుంచి రాపిడ్ ప్రత్యేక వైద్య బృందం ప్రతినిధులు టి.మనోజ్, బి.రాధిక, పనిత్ రాహుల్, రణధీర్ రెడ్డి శనివారం గ్రామాన్ని సందర్శించారు. జ్వరపీడితుల ఇళ్లకు వెళ్లి రక్త నమూనాలు సేకరించారు. పారిశుద్ధ్య లోపం కారణంగా దోమలు, ఈగల బెడద ఎక్కువైతే మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి వ్యాధులు విజృంభిస్తాయన్నారు.

ఐక్య పోరాటాలతోనే సమస్యల పరిష్కారం



బీసీ సంక్షేమ సంఘం నియామకాలు చేస్తున్న రాష్ట్ర ప్రతినిధులు

టెక్కలి: బీసీలు ఐకమత్యంగా ఉంటూ సమస్యలు పరిష్కరించుకోవాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కమిటీ చైర్మన్ రేవు శ్రీనివాస్ అన్నారు. శనివారం టెక్కలిలో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడు వనమాన శ్రీనివాసరావు, కార్యదర్శి దంతిన అప్పలాచారి ఆధ్వర్యంలో జిల్లా సంఘం నియామకాలు చేపట్టారు. అధ్యక్షుడిగా కిల్లి అప్పారావు, ఉపాధ్యక్షులుగా సానపల బాలకృష్ణ, శ్రీరామ్, మహేశ్వరరావు, ఇతర విభాగాల్లో టి.సునీత, కె.ఆదినారాయణ, ఎస్.హరి, టి.కోటయ్య తదితరులను నియమించారు.

మెట్ల నుంచి జారిపడి వ్యక్తి మృతి

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని బాకెర్ సాహెబ్‌పేటకు చెందిన ఓ వ్యక్తి మెట్ల నుంచి జారిపడి మృతిచెందాడని సీఐ ఈశ్వరరావు తెలిపారు. గుజ్జల రామయ్య (51) వెల్డింగ్‌షాపులో పనిచేస్తుండేవాడు. శుక్రవారం ఉదయం టిఫిన్ తిన్నాక మేడపైకి వెళ్లేందుకు మెట్లు ఎక్కుతుండగా పట్టుతప్పి పడిపోయాడు. తల వెనుక భాగంలో తీవ్ర గాయమైంది. ఆ సమయంలో భార్య తాను పనిచేసే షాపింగ్ మాల్‌కు వెళ్లిపోవడంతో పక్కింటివాళ్లు వచ్చి చూశారు. వారిచ్చిన సమాచారంతో భార్య వచ్చి రామయ్యను ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించింది. రామయ్య చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

రణస్థలం: లావేరు మండలం రావివలస సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి శ్రీకాకుళం వైపు నుంచి విశాఖపట్నం వైపు వెళుతున్న లారీ ఢీకొనడంతో కోరాడ నరసింహులు(34) అనే వ్యక్తి మృతి చెందాడు. ఇతని స్వగ్రామం రణస్థలం మండలం కోటపాలెం. సిమెంట్ పనులకు వెళ్తూ కుటుంబ పోషణ సాగిస్తున్నాడు. ఎప్పటిలాగే శుక్రవారం ఉదయం ఇంటి నుంచి బయలు దేరిన నరసింహులు రాత్రయినా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. ఈలోగా రావివలస వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడనే వార్త చేరడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. నరసింహులుకు భార్య సునీత, ఇద్దరు పిల్లలు సాయినిర్వత్, విశ్వశ్రీ ఉన్నారు. మృతుడి తండ్రి సూరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెచ్‌సీ ఎం.విజయానందకుమార్ తెలిపారు. శవపంచనామా అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పిచ్చికుక్క దాడిలో తీవ్ర గాయాలు

బూర్జ: తోటవాడ గ్రామానికి చెందిన దన్నాన అప్పమ్మ పిచ్చి కుక్క దాడిలో తీవ్రంగా గాయపడ్డారు. ఆమె శనివారం పొలం పనులకు తోటి కోడలితో కలిసి వెళ్లి వస్తుండగా దారిలో చెరువు వద్ద పిచ్చి కుక్క దాడి చేసింది. కుడి కంటి దగ్గర, నుదిటి దగ్గర, ముఖంపైన పెద్ద పెద్ద గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు గమనించి 108 వాహనానికి సమాచారం తెలియజేయడంతో సిబ్బంది వచ్చి శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

అంగన్‌వాడీలకు యాప్‌సోపాలు!



పాతపట్నం: అంగన్‌వాడీ కేంద్రంలో సరుకుల కోసం నిరీక్షిస్తున్న లబ్ధిదారులు

- బాలింతలు, గర్భిణుల ముఖ గుర్తింపునకు ముప్పతిప్పలు
- సక్రమంగా పనిచేయని బాలసంజీవని, పోషణ ట్రేకర్ యాప్‌లు

పాతపట్నం :

చిన్నారులు, గర్భిణులు, బాలింతల సంక్షేమానికి కృషి చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు యాప్‌లతో కుస్తీలు పడుతున్నారు. లబ్ధిదారుల ముఖచిత్ర (ఫేస్ రికగ్నైజేషన్) గుర్తింపునకు పడరాని పాట్లు పడుతున్నారు. యాప్‌లు పనిచేయక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. యాప్‌ల భారం తగ్గించాలంటూ పోరుబాటు పడుతున్నారు. ఇటీవలే పాతపట్నం, కొత్తూరులోని మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. లబ్ధిదారుల కు పోషకాహారం పంపిణీ చేయాలంటే తప్పనిసరి గా ముఖ చిత్ర గుర్తింపు చేయాల్సిందే. అలా చేయకుండా ఆహార పదార్థాలను అందించలేరు. యాప్ లు సరిగ్గా పనిచేయకపోవడంతో సకాలంలో ప్రక్రియ జరగక ఇటు లబ్ధిదారులు, అటు అంగన్‌వాడీ కార్యకర్తలు అవస్థలు పడుతున్నారు.



పోషణ ట్రేకర్ యాప్

పోషకాహార పంపిణీపై ప్రభావం..

సబ్ధిదారులకు పోషణ ట్రేకర్, బాల సంజీవని అందించాలంటే రెండు యాప్‌లు నిర్వహించాలి. లబ్ధిదారు ఫేస్ రికగ్నైజ్ చేసి యాప్‌లో నమోదు చేయాలి. అయితే ఇక్కడే పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ గుర్తింపు చాలాసార్లు విజయవంతం కావడం లేదని అంగన్‌వాడీ కార్యకర్తలు చెబుతున్నారు. ప్రభుత్వం బాలసంజీవని ద్వారా లబ్ధిదారులకు ముఖ గుర్తింపుతో బియ్యం ఇస్తోంది. ఇప్పుడు తాజాగా కేంద్ర ప్రభుత్వం రూపొందించిన పోషణ ట్రేకర్ ద్వారానే లబ్ధిదారులను గుర్తించి సరుకులు ఇవ్వాలనే నిబంధనను తప్పనిసరి చేసింది.

గతంలో సులభంగా..

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలతో పాటు 6 నెలల నుంచి 3 సంవత్సరాల లోపు వయసున్న బాలలకు ప్రతి నెల పోషకాహారాన్ని ఇంటికే అందిస్తున్నారు. గతంలో లబ్ధిదారులకు అంగన్‌వాడీ కేంద్రాల వద్ద పోషకాహారం ఇచ్చేవారు. అయితే ఎక్కువ మంది తమకు ఇంటి వద్దకే పోషకాహారం కావాలంటూ ప్రభుత్వాన్ని అభ్యర్థించడంతో టీహెచ్ఆర్ (టేక్ హోమ్ రేషన్)గా మార్చారు. పాలు, కోడి గుడ్లు, నూనె, పప్పు దినుసులు, బియ్యం వంటివి ప్రతి నెలా రెండు దఫాలుగా అందిస్తున్నారు. ఇవన్నీ పంపిణీ చేయాలంటే వారందరి పూర్తి వివరాలను పోషణ యాప్ ద్వారా రెండు సార్లు నమోదు చేయాల్సి వస్తోందని కార్యకర్తలు చెబుతున్నారు. టీహెచ్ఆర్ కోసం ఒకే లబ్ధిదారును రెండు సార్లు ముఖ యాప్ ద్వారా గుర్తించాల్సి రావడం కూడా ఇబ్బందికరంగా మారిందంటున్నారు. నెలలో ఎక్కువ సమయం ఈ పనికే వినియోగించడం వల్ల చిన్నారులకు ప్రాథమిక విద్యకు ఇబ్బందిగా మారిందని అంగన్‌వాడీ కార్యకర్తలు అంటున్నారు.

రేషన్ కోల్పోతున్నాం..



ముఖ గుర్తింపు పోషణ యాప్ ద్వారా 15 సార్లు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఒకసారి సక్సెస్ అని వచ్చినా రెండో సారి మ్యాచ్ కావడం లేదు. దీని వల్ల రేషన్ కోల్పోతున్నాను. ప్రభుత్వం స్పందించి యాప్ కష్టాల నుంచి తప్పించి, సులభతరంగా రేషన్ సరుకులు అందించే ఏర్పాట్లు చేయాలి.

– ఐ.రవణమ్మ, పిల్లల తల్లి, దువ్వారివీధి, పాతపట్నం

యాప్‌ల భారం తగ్గించాలి



ప్రభుత్వం తక్షణమే స్పందించి కార్యకర్తలపై యాప్ భారం తగ్గించాలి. తల్లికి, బిడ్డకు పోషణతో పాటు బిడ్డకు టీకాలు, వారి ఆరోగ్య కార్డులు తదితర వివరాలు నిత్యం యాప్ ద్వారా నమోదు చేయడం కష్టంగా ఉంది. అంగన్‌వాడీ కార్యకర్తలపై యాప్‌ల భారం తగ్గించాలి.

– బి.శాంతామణి, అధ్యక్షురాలు, అంగన్‌వాడీ ప్రాజెక్టు కమిటీ, పాతపట్నం



పాతపట్నం ఐసీడీఎస్ పీవోకు వినతిపత్రం అందజేసిన అంగన్‌వాడీ కార్యకర్తలు (ఫైల్)

బోధనకు ఆటంకం..

అంగన్‌వాడీ కార్యకర్తలు ఆయా కేంద్రాల్లో 15 రకాల రికార్డులు నిర్వహించాల్సి వస్తోంది. దీని వల్ల చిన్నారులకు ప్రాథమిక విద్య బోధించేందుకు ఇబ్బందులు కలుగుతున్నాయని వాపోతున్నారు. లబ్ధిదారులకు అందించే ఆహార వినియోగం (ఎఫ్.సి.ఆర్), పిల్లలు, గర్భిణులు, బాలింతలకు నమోదు చేసే రికార్డులు (ఎస్ఎన్‌పి), ప్రీ స్కూల్ అడ్మిన్ విద్యార్థుల వివరాలు ప్రతి నిత్యం నమోదు చేయాల్సి ఉంటుంది. వీటితో పాటు పిల్లల టీకాలకు సంబంధించిన రిజిస్టర్, విటమిన్–ఎ రికార్డు, రిఫరల్ సర్వీసెస్ గృహ సందర్శకుల రికార్డులు నిర్వహించాలి. నెలవారీ ప్రాజెక్టు (ఎంటీఆర్), ఆయా అంగన్‌వాడీల పరిధిలోని హౌస్ హెల్త్ సర్వే, గ్రోత్ రికార్డు, గ్రోత్ చార్టులతోపాటు చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సంబంధించి టేక్ హోమ్ రేషన్ పంపిణీ రికార్డు, స్టాప్ అడ్మిషన్ రిజిస్టర్ నిర్వహించాల్సి ఉంటుంది. ఇంత పని ఒత్తిడి వల్ల పిల్లలకు ప్రాథమిక విద్య బోధించేందుకు సమయం సరిపోవడం లేదని కార్యకర్తలు వాపోతున్నారు.

ఆరోగ్యశ్రీ సేవలు మెరుగుపరచాలి



ఆరోగ్యశ్రీ సేవలపై ఆరా తీస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

నరసన్నపేట: ప్రైవేటు ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ ఆరోగ్యశ్రీ సేవలను మెరుగుపరచాలని, రోగులకు మరింత బాధ్యతగా సేవలు అందించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. నరసన్నపేట ఏరియా ఆస్పత్రిని స్థానిక ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తితో కలిసి కలెక్టర్ శనివారం పరిశీలించారు. ఆరోగ్యశ్రీలో ఎందుకు ఎక్కువగా ఆపరేషన్లు చేయడం లేదని వైద్య సిబ్బందిని ప్రశ్నించారు. అన్ని కేసులను ఆరోగ్యశ్రీలో చేర్చాలని, ఈ మేరకు వైద్యులకు సూచనలు, సలహాలు ఇవ్వాలని డీసీహెచ్ కళ్యాణ్‌బాబు వివరించారు. వైద్యులు రెండు పూటలా ఆసుపత్రిలో సేవలు అందించాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతకుముందు ఆసుపత్రి నూతన భవనాలు నిర్మాణంలో జరుగుతున్న జాప్యంపై ఇంజినీర్లను ప్రశ్నించారు. పనులు వేగవంతం చేయాలని ఎన్నిసార్లు చెప్పినా కాంట్రాక్టర్ స్పందించడం లేదని ఏపీఎంఎస్ఐడీ ఈఈ సత్యప్రభాకర్ కలెక్టర్‌కు వివరించారు. చేసిన పనులకు బిల్లులు చెల్లించినా పనులు పూర్తి చేయడం లేదని తెలిపారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ట్రైనీ కలెక్టర్ డి.పృథ్వీరాజ్‌కుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనుబాబు, ఏఓ ఏపీవీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బీల థర్మల్ ఉద్యమకారులపై కేసులు ఎత్తివేయాలి

- హైకోర్టులో రిట్ దాఖలు



మాట్లాడుతున్న బీల ఉద్యమకారులు, న్యాయవాదులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రపంచ ప్రసిద్ధిగాంచిన చిత్తడి నేలల ప్రాంతమైన సోంపేట మండలం బీల వద్ద థర్మల్ విద్యుత్ కేంద్రం పెట్టాలనే ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ సాగిన ఉద్యమంలో అప్పటి ప్రభుత్వం ఉద్యమకారులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని కోరుతూ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో రిట్ దాఖలు చేశామని బీసీ న్యాయవాదుల సంఘం, బీల ఉద్యమకారులు తెలిపారు. జిల్లా కేంద్రంలోని శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ బీల వద్ద థర్మల్ ప్లాంట్ వద్దంటూ ఉద్యమం చేపట్టిన వారిపై 2010 జూలై 14న నాటి ప్రభుత్వం కాల్పులు జరిపి ముగ్గురు మృతికి, పలువురు గాయాలు పాలవడానికి కారణమై తిరిగి ఉద్యమకారులపైనే కేసులు బనాయించిందని తెలిపారు. 14 ఏళ్లుగా వారిని కోర్టుల చుట్టూ తిప్పుతున్న వైనాన్ని వ్యతిరేకిస్తూ ఈ కేసులో ప్రథమ ముద్దాయి బీన ఢిల్లీ రావు మిగతా 23 మంది ముద్దాయిలతో కలిసి ఆంధ్రప్రదేశ్ బీసీ న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి, హైకోర్టు న్యాయవాది చౌదరి లక్ష్మణరావు ద్వారా ఆంధ్రప్రదేశ్ బీసీ న్యాయవాదుల సంఘం అధ్యక్షులు ఆగూరు ఉమా మహేశ్వరరావు సహకారంతో హైకోర్టులో న్యాయవాది కరుకోల సింహాచలం రిట్ పిటిషన్(28409/2025) దాఖలు చేశారన్నారు. ప్రతివాదులుగా ఉన్న హోం శాఖ ముఖ్యకార్యదర్శి, డీజీపీ, శ్రీకాకుళం ఎస్పీ మిగిలిన ఏడుగురు పోలీసు అధికారులకు నోటీసులు జారీ అయ్యాయని తెలిపారు. కేసుల వల్ల చాలా మంది యువకులు వీసాలు, పాస్ పోర్టులు రాక ఉపాధి కోసం విదేశాలకు వెళ్లలేక, స్థానికంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.

కార్గిల్ వీరులు చిరస్మరణీయులు



మాజీ ఎయిర్ మార్షల్ రామారావును సత్కరిస్తున్న కాలనీ వాసులు

శ్రీకాకుళం కల్చరల్ : జిల్లా పరిషత్ ఎదురుగా ఉన్న హౌసింగ్ బోర్డు కాలనీలోని కార్గిల్ పార్కులో శనివారం కార్గిల్ విజయదివాస్ నిర్వహించారు. వీర జవాను విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న ఏరోనాట్ విశ్రాంత మార్షల్ వారెంట్ ఆఫీసర్ రఘుపాత్రుని రామారావు (రమేష్)ను కాలనీసభ్యులు సత్కరించారు. ఈ సందర్భంగా రామారావు కార్గిల్ యుద్ధ అనుభవాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో గివిడి వాసు, మందుల మోహనరావు, హేమచంద్ర తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక కప్పేసి క్రీడా మైదానమా?



పనులు అడ్డుకుంటున్న గ్రామస్తులు

వజ్రపుకొత్తూరు : కొత్తపేట– కొమరల్తాడ గ్రామాల మధ్య అటవీభూముల్లో శ్మశాన వాటిక, చెరువులను కప్పేసి క్రీడా మైదానం చేస్తే సహించేది లేదని గ్రామస్తులు ఆందోళనకు దిగారు. శ్మశాన వాటికను కప్పేసి ఆట స్థలం చేసేందుకు టీడీపీ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు గోవింద పాపారావు వారం రోజులుగా ఏకపక్షంగా పనులు చేట్టడంపై మండిపడ్డారు. ఈ మేరకు శనివారం సర్పంచ్ అంబటి శ్రీను ఆధ్వర్యంలో 50 మందికి పైగా గ్రామస్తులు పనులను అడ్డుకున్నారు. కొత్తపేట పంచాయతీ దిబ్బవానిపేటకు ఆనుకుని అటవీ భూముల్లో రెండు గ్రామాలకు సంబంధించిన శ్మశాన వాటిక, దానికి ఆనుకుని చాకలి చెరువు, మరో చెరువు ఉన్నాయని, ఉపాధి పనులు సైతం చేపట్టారని చెప్పారు. ఆట స్థలం కోసం శ్మశాన వాటిలో నిర్మించిన దహన వాటిక సైతం కూల్చేయడం తగదన్నారు. అనంతరం ఎంపీడీఓ ఎన్.రమేష్‌నాయుడును కలిసి పనులు నిలిపివేయాలని వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు గుంటు బాలకృష్ణ, గీత కామరాజు, ఎస్.నడిపిరాజులు, ఎస్.కృష్ణమయ్య, యోగేశ్వరరావు, వి.కొర్లయ్య ఎం.నారాయణ, గుంటు త్రినాథ్, గీత గణేష్, కారి కొర్లయ్య, గీత ముకుంద, జి.వీరస్వామి, సాధుబాబు పాల్గొన్నారు.

సిక్కోలు ప్రజలకు అందుబాటులో ఎస్ఎస్ జ్యూయలరీ



జ్యోతిప్రజ్వలన చేస్తున్న సినీ నటి ఈషా, అధినేతలు వెంకట సత్యనారాయణ తదితరులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సిక్కోలు మహిళల అభిరుచులకు తగ్గట్లు అందరికీ నాణ్యమైన ఆభరణాలు అందించే షోరూం ఎస్ఎస్ జ్యూయలరీ అని సినీ నటి ఈషారెబ్బా అన్నారు. శ్రీకాకుళం నగరంలోని జీటీ రోడ్డులో శనివారం ఎస్ఎస్ జ్యూయలరీ నూతన షోరూమ్ ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యేలు గొండు శంకర్, మామిడి గోవిందరావులు మాట్లాడుతూ అతివలకు కావాల్సిన సరికొత్త మోడల్స్ ఎస్ఎస్ జ్యూయలరీలో దొరకడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్లు ఎంవీ పద్మావతి, పైడిశెట్టి జయంతి, వైఎస్సార్‌సీపీ కళింగవైశ్యకుల రాష్ట్ర అధ్యక్షుడు అంధవరపు సూరిబాబు, గురుగుబెల్లి లోకనాథం, మెండ దాసునాయుడు, ఎస్ఎస్ జ్యూయలరీ అధినేతలు కిల్లంశెట్టి వెంకట సత్యనారాయణ, శ్రీనివాసరావు, సురేష్, అంధవరపు సంతోష్, ప్రసాద్, పాండ్రంకి శంకర్, అంపోలు మూర్తి, ఊన్న నాగరాజు, పైడి రాజారావు, మూకళ్ల తాతబాబు, పైడిశెట్టి బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

'ఖాతాదారులూ.. ఆందోళన వద్దు'



విచారణ చేస్తున్న పోస్టల్ ఇన్‌స్పెక్టర్లు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం సబ్‌పోస్టాఫీస్‌లో భారీ స్కామ్ జరిగినా ఖాతాదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పోస్టల్ ఇన్‌స్పెక్టర్లు శ్రీకాంత్, కమల్‌హాసన్ తెలిపారు. శనివారం పోస్టాఫీస్ కార్యాలయంలో స్కామ్ జరిగిన ఖాతాదారుల నుంచి క్లెయిమ్స్ తీసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి పూర్తి విచారణ చేసి పోస్టల్ ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. ఖాతాదారులంతా పోస్టల్‌లో చేసుకున్న ఫిక్స్‌డ్ డిపాజిట్ల సొమ్ము వడ్డీతో సహా నేరుగా వారి ఖాతాల్లోకి చేరుతుందన్నారు. ఇప్పటికే ఈ కేసుకి సంబంధించిన పూర్తి విచారణ చేపట్టడానికి పోస్టల్ సూపరింటెండెంట్ సీబీఐని కోరినట్లు పేర్కొన్నారు.

మాల్స్‌ను కాంక్రీట్ బాక్స్‌లా నిర్మించవద్దు

- అలాంటి వాటికి ఇకపై అనుమతులు నిరాకరణ
- ఫైర్ డీజీ మాదిరెడ్డి ప్రతాప్



షాపింగ్‌మాల్ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఫైర్ డీజీ మాదిరెడ్డి ప్రతాప్

శ్రీకాకుళం క్రైమ్: రాష్ట్రవ్యాప్తంగా షాపింగ్‌మాల్స్‌ను కాంక్రీట్ బాక్సులు మాదిరిగా కడుతున్నారని, ప్రమాదం జరిగితే ప్రజలు బయట పడే విధంగా కనీసం ఫైర్ ఎగ్జిట్స్ కూడా లేకుంటా కట్టడం ప్రాథమికంగా తప్పు అని రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల డైరెక్టర్ జనరల్ మాదిరెడ్డి ప్రతాప్ అన్నారు.మాల్స్‌లో బ్రీతింగ్ బాల్కనీలు, వాటి గుండా మెట్లు నిర్మిస్తే రక్షణగా నిలుస్తాయన్నారు. ఈ ఏడాది జనవరి 25న శ్రీకాకుళం నగరంలోని సౌత్ ఇండియా షాపింగ్ మాల్ అగ్నిప్రమాదానికి గురైన సంగతి తెలిసిందే. తిరిగి అదే భవనాన్ని యాజమాన్యం పునఃనిర్మించడంతో ఫైర్ సేఫ్టీ అంశాలను పరిశీలించేందుకు డీజీ శనివారం శ్రీకాకుళంలోని మాల్‌కు వచ్చి పరిశీలించారు. సరిగ్గా 10 రోజుల క్రితం ఇరాక్‌లో ఓ మాల్‌లో పని వేళల్లో అగ్ని ప్రమాదం సంభవించి 82 మంది చనిపోవడాన్ని గుర్తు చేశారు. అనంతరం విలేకరులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఇకపై కచ్చితంగా నిబంధనలు పాటిస్తేనే స్మోక్ సర్టిఫికెట్ ఇస్తామన్నారు. అనంతరం సౌతిండియా షాపింగ్ మాల్ రీజనల్ మేనేజర్ బి.నవీన్‌కుమార్‌కు ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్ అందజేశారు. కార్యక్రమంలో విశాఖపట్నం రీజనల్ అధికారి డి.నిరంజన్‌రెడ్డి, జిల్లా అధికారి జడ్డు మోహనరావు, సహాయాధికారి శ్రీనుబాబు, రెండో పట్టణ సీఐ పి.ఈశ్వరరావు, ఎస్ఐ సంతోష్‌కుమార్, ఫైర్ సిబ్బంది, షాపింగ్ మాల్ సిబ్బంది పాల్గొన్నారు.

పోర్టును సందర్శించిన అగ్నిమాపక శాఖ డీజీ

టెక్కలి: సంతబొమ్మాళి మండలం మూలపేట పోర్టును అగ్ని మాపక శాఖ డీజీ మాదిరెడ్డి ప్రతాప్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా పోర్టు నిర్మాణం పనులను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఆయనతో పాటు అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి మోహన్‌రావు, పోర్టు జీఎం శంకర్ తదితరులు ఉన్నారు.

కారులో సారా రవాణా

- నలుగురు అరెస్ట్



పట్టుబడిన కారు, సారాతో ఎక్సైజ్ సీఐ, సిబ్బంది

కంచిలి: మండలంలోని జక్కర రైల్వేగేట్ వద్ద కారులో నాటుసారా రవాణా చేస్తుండగా సోంపేట ఎక్సైజ్ సీఐ జి.వి.రమణ, సిబ్బంది దాడిచేసి పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. కారులో సారా రవాణా జరుగుతుందని వచ్చిన సమాచారం మేరకు సిబ్బంది జక్కర రైల్వేగేటు వద్ద కాపుకాశారు. కారు రాగానే తనిఖీ చేయగా అందులో 12 పాలిథిన్ సంచుల్లో ఉంచిన 240 లీటర్ల సారా, 5 గోనె సంచుల్లో ఉన్న 1250 సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. వీటిని రవాణా చేస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకుని కారు స్వాధీనం చేసుకున్నారు. వీరంతా కంచిలి మండలం సాలినపుట్టుగ గ్రామానికి చెందిన సాలిన సూర్యనారాయణ, కత్తివరం గ్రామానికి చెందిన మద్దిల ప్రసాద్, పులకపుట్టుగ గ్రామానికి చెందిన పులక కూర్మారావు, ఒడిశాకు చెందిన లోకనాథంగా గుర్తించి వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. వీరికి సారా సరఫరా చేస్తున్న ఒడిశా రాష్ట్రం జగన్నాథపురం గ్రామానికి చెందిన కొరికాన ప్రకాష్‌పైనా కేసు నమోదు చేశారు. అరెస్టయిన నలుగురినీ సోంపేట మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చనున్నట్లు సీఐ తెలిపారు. పట్టుబడిన సారా విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ దాడుల్లో సిబ్బంది మార్కారావు, భాను, అరుణ్, ఉమాపతి, గుణకర్ పాల్గొన్నారు.

ఎరువుల పంపిణీలో గందరగోళం



వ్యవసాయ కార్యాలయాన్ని చుట్టుముట్టిన రైతులు

సంతబొమ్మాళి: మండల కేంద్రం సంతబొమ్మాళి వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద ఎరువుల కోసం రైతులు శనివారం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముందు రోజు టోకెన్లు ఇచ్చిన అధికారులు ఆ మరుసటి రోజు ఎరువులు అడిగితే.. ఇప్పుడా టోకెన్లు పనికి రావని ఎరువులు లేవంటూ చెప్పడంతో రైతులు ఆందోళనకు దిగారు. టోకెన్ ఇచ్చి ఇప్పుడు ఎరువులు లేదంటే కుదరదని, వచ్చిన ఎరువులు ఎక్కడ అమ్మారో, ఎవరికి ఇచ్చావో చెప్పాలని పలువురు రైతులు మండల వ్యవసాయాధికారి రాయల అప్పారావును నిలదీశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ బి.హేమసుందరరావు, పోలీసులు రంగ ప్రవేశం చేసి రైతులకు నచ్చజెప్పారు. ఆధార్ కార్డు, పాస్ పుస్తకం ప్రకారం రైతుకు ఒక బస్తా ఇస్తామని చెప్పారు. దీంతో రైతులు అసహనం వ్యక్తం చేశారు.

ఉత్సాహంగా పారా అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా స్థాయి పారా అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో స్టీఫెన్ హాకింగ్ పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ శ్రీకాకుళం ఆధ్వర్యంలో శనివారం జిల్లా స్థాయి జూనియర్ – సబ్ జూనియర్స్ పారా అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి పారా అథ్లెట్లు హాజరై ప్రతిభ నిరూపించుకున్నారు. ఇక్కడ ఎంపికైనవారు రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారని నిర్వాహకులు తెలిపారు. 100 మీటర్లు, 400 మీటర్లు, 1500 మీటర్ల పరుగు, షాట్‌పుట్, లాంగ్ జంప్, డిస్కస్ త్రో, జావెలిన్ త్రో తదితర అంశాల్లో ఎంపికలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు టి.రాము, కార్యదర్శి డి.అచ్యుతరావు, స్రవంతి, మోహనరావు, ఖేలో ఇండియా అథ్లెటిక్స్ కోచ్ శ్రీనివాస్, అథ్లెట్లు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.